250

# ఆత్మశాంతి

ఆమె మాట్లాడకుండా కూర్చుంది.

మొగంపైకి బాధగా జారుతూన్న కన్నీళ్ళ నామె తుడుచుకోవడం లేదు.

బయట పసిపాప తప్పటడుగుల్లా పెద్ద పెద్ద చినుకులు నాలు గిట్టేపడి మాయమైపోయాయి.

"అంత అదృష్టమూ..." ఒక్కసారిగా ఆమె కళ్లు పాప వచ్చినట్లుగా ఉలిక్కిపడ్డాయి. కాని—

"ఏదీ పాప?"

ఆమె కళ్లు భయంతో పాప యింక దొరకదేమో అన్నంత అనుమానంతో పిచ్చిగా ఒకసారి అటూ ఇటూ తిరిగాయి.

శంకరం ఆమెకెదురుగా కూర్చొని పుట్టెడు దుఃఖంతో ఆమెవైపు జాలిగా చూశాడు. అతని కళ్ళల్లో నీళ్లునిలిచాయి. "ఇందులో నా తప్పేమీ లేదు... నా మాట నమ్ము" అని అతని ఎద ఏమిటో దీనంగా శాంతకు నివేదించుకుంది. కాని, ఆమె ఆ మాటలు వినిపించుకోలేదు.

అంత దుఃఖములోనూ ఆమె కళ్ళలో నిలిచిన ఒకానొక ఎరుపు అతనిని, అతని జీవితంనుంచి ఒక్క-క్షణంపాటు వేరు చేసేసింది. బాధ మీద బాధ పేరుకుంది.

ఆ చూపు అతను భరించలేదు. "శాంతా ... నన్ను నమ్ము... రెండురోజులలో పాపను గాలించి తెచ్చే బాధ్యత నాది... లే శాంతా..." అన్నాడు.

కాని ఆమెలో చలనం లేదు.

పాపతో తిరుపతికొండ ఎక్కి-న శాంత పాపలేకుండా ఎట్లా తిరుగుముఖం పట్టగలదు ?

పాప ఎలా మాయమై పోయిందో ఎవరికీ తెలియదు. శంకరం అటువైపు అలా వెళ్ళాడు. పాప అతని వెనుకనే బయలు దేరింది. శంకరం పాపను లోనికి వెళ్ళిపొమ్మన్నాడు. ఈ మాట శాంత వింది. 'నేనూ వస్తాను నాన్నాగారూ...' అంది పాప. ఈమాటకూడా శాంత వింది. కాని, పాపం శంకరం ఈమాట వినలేదు. పాప, వాళ్ళ నాన్న గారితో వెళ్ళిందని గదిలో బట్టలు సర్దుకుంటూ ఉన్న శాంత అనుకుంది. కాని, శంకరం అటుతిరిగి యిటు తిరిగి గుడిచుట్టూ ఎక్క-డ చూసినా కనిపించే అనేక వందల సుందర స్త్రీల మూర్తుల ఆకారాలను తనివిదీర చూసి తీరిగ్గా ఆగదికి ఓ రెండుగంటలు అనంతరం చేరాడు.

ఇంకేముంది ! తనకెంతో ప్రియతమమైన పాపను

'పాపా...' అని పిలిచాడు. 'పాప ఏదీ...' అని శాంతను అడిగాడు.

'ఏమిటీ... పాప మీతో రాలేదూ...' అంది శాంత.

శంకరం ఒక్కసారి నిలువునా కంపించి పోయాడు. అతని మనస్సు ఒక్కసారి బెదిరిపోయింది. ఒక్కసారి గుడిచుట్టూ తిరిగాడు. తిరగడమేమిటి పరుగెత్తాడు. తల్లుల చెంతవున్న పిల్లల నందరినీ చూశాడు. తండ్రుల చెంతవున్న పాప వయసు అమ్మాయిల నందరినీ పరీక్షించాడు. కాని పాప కనిపించలేదు. మళ్ళీ పరుగెత్తుకొని గది దగ్గరకు వచ్చాడు.

శాంత ఆందోళనగా, 'ఏదీ పాప...' అంది.

శంకరం పిచ్చిగా పోలీసు స్టేషను వైపు పరుగెత్తాడు. అక్కడ రిపోర్టిచ్చి గుడి క్రిందికి కారులో వచ్చాడు. స్టేషనులో అంతా వెదికాడు. కాని, అప్పటికే రెండు బళ్లు అటూ యిటూ చల్లగా వెళ్ళిపోవడం జరిగింది.

శంకరానికి తల తిరిగింది. కనిపించిన వాళ్లనల్లా పాప గురించి ప్రశ్నించాడు.

'మా పాప తప్పిపోయిందండీ ... మీరుగాని చూశారా...' అన్నాడు. 'తెల్లగా ఉంటుందండీ ... అయిదేళ్ళు ఇంకా వెళ్ళలేదండీ... మీకు కనిపించ లేదూ...అయ్యో... ఎక్కడ దొరుకుతుంది. ఎవరికి చేతులొచ్చాయి మా పాపను ఎత్తుకపోవడానికి. పెద్ద కళ్ళండీ. దొరల పిల్లలా కట్ చేసినతల.

ఎర్రని సిల్కు రిబ్బనుముడి. చేతికి రెండేరెండు ఎర్రనిప్లాస్టిక్ గాజులు' అంటూ పాపం గట్టిగా విలపించాడు. దుఃఖం ఎక్కువై పోగా, ఆమీద టపేమీ మాట్లాడలేక పోయాడు. అలసిన కన్నులతో అందరి హృదయాలు ద్రవించేట్టు 'మా పాప ఇంక కనిపించదాండి; ఇంక కనిపించదూ ...' అంటూ పిచ్చిగా ఏడ్చాడు.

ఏమి చెయ్యడానికీ తోచని శంకరం పాపం ఆగదిలో శాంత ముందు నిరాశా నిస్పృహలతో మాటామంతీ లేకుండా అలాకూర్చుండి పోయాడు. ఒక్కసారి అతనిగుండెల్లో ఏదో కలచినట్లై, 'మేము, ఏం పాపము చేశాము స్వామీ ...' మాకీ శిక్ష ... నీదగ్గర కొచ్చి నందులకిదా మర్యాద' అన్నాడు.

శాంత ఈమాటలు వినలేక పోయింది. ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ ఏడుపులోనే శంకరంవైపు తీక్షణంగా చూసింది. శంకరం ఆచూపుకు తట్టుకోలేక పోయాడు. వెంటనే ఆమె మొగం ఆవలకు త్రిప్పుకొని వలవల ఏడ్చింది, అలా విలపిస్తూనే "మీరు చేసిన పాపానికి ఈ శిక్ష సరిపోయింది" అంది.

శంకరాన్ని శాంత ఇంతమాట ఎప్పుడూ అనలేదు. ఆ విచారంలో ఆమెకు ఎట్లా మాట్లాడాలో తోచి ఉండదు. ఎంతమాట ఒక్కసారి అంది!

శంకరానికి కంత విచారంలోనూ శాంతమీద ఎక్కడ లేని కోపం వచ్చింది. కాని, "ఔను... నేను చేసింది పాపమే నేమో... అందుకనే ఈ శిక్ష జరిగిందేమో..." అని దిగులు పడిపోయాడు. "నన్ను క్షమించు భగవంతుడా...క్షమించు..." అన్నాడు. "పాపను మేం ఇంటికి తిరిగివెళ్ళేలోగా మాదగ్గరకు చేర్చు..." అని చేతులు జోడించాడు.

కాని, శంకరం హృదయం మాత్రం అతను చేసింది పాపమని ససేమిరా ఒప్పుకోలేకపోయింది. ఎంత ఆలోచించినా అతనికి తను చేసింది పాపం కాదన్న అనుమానం మాత్రం వదలడం లేదు. శాంత ఒకసారి ఆ సంఘటన జరిగినప్పుడు ఆ మాట అంది. కాని, ఇప్పుడు ఈ సమయాన శాంత ఆ మాటను ఇలా గుర్తుచేయడం ఎంత బాధగా ఉంది!

శంకరం పాపను ఆ తల్లికన్నా ఎంతగానో ప్రేమిస్తాడు కాని, భార్య ఈ విధంగా జరిగిపోయినదానికీ దీనికీ ముడిపెట్టడంతో అతని మనస్సు పూర్తిగా ముక్కలై పోయింది. ఒక ముక్క పాపకోసం వెదుకుతూంటే వేరొకటి ఆ పాపానికి శిక్ష ఇదే ... ఇదే ... అని వేయి కంఠాలతో గగ్గోలచేసి పారేస్తూంది.

శంకరం తల పట్టుకొని, అక్కడే అలాగే గోడ కానుకొని చతికిలబడిపోయాడు.

## 2

శంకరం బాగా ఉన్నవాడు. అతనికి ఉద్యోగం చేయవలసిన అగత్యం లేదు. బ్యాంకులో పాతిక ముప్పైవేల పైనే నిల్వ వుంది. ఇళ్ళమీద అద్దెలు వస్తూ ఉంటాయి. పంట కూడా వస్తూ వుంటుంది. అయినా అతను చిన్న ఉద్యోగం చేస్తున్నాడు.

అతనికి చదువు బాగా అబ్బలేదు. ఇంటరు ఎలాగో ఓలాగ గట్టెక్కడంతో చదువుకు స్వస్తిచెప్పాడు. కొన్నాళ్ళింటివద్దే హాయిగా కూర్చున్నాడు. తండ్రి ఎంత చదువుకోమన్నా సనేమిరా వినలేదు. ఎప్పుడూ ఇంట్లోనే కూర్చునేవాడు బయిట కెక్కడకూ వెళ్ళేవాడు కాదు. సాయంకాలాలప్పుడు కూడా ఎక్కడకూ వెళ్ళేవాడు కాదు. "మెయిలు" దగ్గరకు మాత్రం చక్కగా ముస్తాబై వెళ్ళి అందులో మొదటి తరగతిలో కనిపించే అందమైన అమ్మాయిలను చూస్తూ బొమ్మలా నిలబడిపోయేవాడు. ఇంటికి తిరిగి వచ్చేప్పుడు వీధుల్లో ఎక్కడైనా చక్కని అందమైన ఆడపిల్లలు కనిపిస్తే వాళ్ళవైపు పిచ్చిగా చూసేవాడు. ఇంతలో వాళ్ళు తనను చూడటమంటూ పడితే తలను ఎంతో బుద్ధిమంతుడులా వంచేసేవాడు. ఈ సంగతి తెలియని ఆ వీధిలోని పెద్దలు. శంకరం అంత మంచివాణ్ణి, అందులో డబ్బు వుండి ఇంత మంచిగా ఉంటూన్నవాణ్ణి ఎక్కడా చూడబోము అనుకునేవారు.

అవును మరి! అతను సిగరెట్లు కాల్చడు. డబ్బు తగలెయ్యడు!! కనీసం సినీమాలుకూడా ఎప్పుడోగానిచూడడు!!!

కాని, అతని తండ్రి అతని ఈ అలవాట్లు చూసి చాల బాధ పడిపోయాడు. పదిమందిలోనూ తిరిగితే ఇప్పుడున్న ఈ స్తబ్ధత విరగడవుతుందేమోనని ఆశించాడు. వెంటనే జిల్లా బోర్డులో ఉద్యోగం సంపాదించాడు.

అయితే శంకరం అక్కడ పనిచేస్తూకూడ ఒకరితో మాట్లాడటంగాని, స్నేహాలు చేయటంగాని పెట్టుకోలేదు. అందరితోనూ ఒకేరీతిగా ముక్తసరిగా మాట్లాడి వూరుకొనే వాడు.

గుమాస్తాలు కొందరు కాస్త ఉన్నవాడేకదా అని కనీసం కాఫీనీళ్లయినా గిట్టుబాటు కాకుండా ఉంటాయా... అని శంకరంతో స్నేహం చెయ్యడానికి ప్రయత్నించినా అట్లాంటిదేమీ కుదిరేది కాదు. వాళ్లు డబ్బులిచ్చేస్తూంటే అతను తనలో "వాళ్లు పిలిచారు... అందువల్ల ఎక్కువగా తింటే వాళ్లు బాధ పడొచ్చు. అంచాత మర్యాదకు కాఫీ త్రాగి వూరుకున్నాను. నన్ను వాళ్లు పిలిచినప్పుడు మరి నేను డబ్బులివ్వడం ఏం సబబుగా ఉంటుంది. మరి డబ్బులు వాళ్లివ్వడమే సరియైన పద్ధతి" అనుకొనేవాడు.

ఆ మరునాడు ఆ కాఫీ యిప్పించినవారికి బాకీ తీర్చేస్తున్నట్లుగా బంట్రోతును పిల్చి అరకప్పు కాఫీ అతని కిచ్చి

రమ్మనేవాడు. కాని ఆ బంట్రోతుతో తన కేమీ తెప్పించుకొనేవాడు కాదు.

ఇలాంటి పిసినికొట్టు ఒంటిపిల్లి రాకాసితో పాపం వాళ్ళు మాత్రం ఏమి స్నేహం చేయగలరు? అతనితో మరి వాళ్ళూ అంతంత మాత్రంగానే ఉండటంలో పొరపాటేమీ చెయ్యలేదు.

ఉద్యోగం వెలిగిస్తూకూడ శంకరం ఏమాత్రం మారక పోవడం చూచిన తండ్రి అతనికి పెళ్లి చేసే స్తేనేగాని, అతనిలో మనిషి కుండవలసిన చైతన్యం తీసుకురావడం కష్టం అనుకున్నాడు. తల్లి లేని పిల్లవాడైన శంకరాన్ని, ఆ తండ్రి ఎంతో గారాబంగా పెంచాడు. ఒక్కమాట అతన్ని అనడం గాని, అతని ముందు కసరుకోవడం గాని, విసుగుకోవడంగాని, ఆ తండ్రి ఎప్పుడూ చేయలేదు. ఎవరో ఒక ముసలమ్మను వంటకు పెట్టుకున్నాడు. ఆ ముసలమ్మకు శంకరం అంటే వల్లమాలిన భయం. ఏ సమయాన ఏ వంక పెడతాడో అని బితుకు బితుకు మంటూ వుండేది. భోజనం దగ్గర కూర్చొని, శంకరం ఏమిటో ఆలోచిస్తూ ఎక్కడో మనసు పెట్టి భోజనం సాగించేవాడు. తరువాత ఏదో నవల చదువుకుంటూ నిద్రలోకి జారిపోయేవాడు. ఒక్కసరి మాటలు తప్పించి అతను ఆ ముసలమ్మతో ఒక్కమాట అదనంగా మాట్లాడలేదు.

ఇవన్నీ జాగ్రత్తగా గమనించిన తండ్రి, "ఏమిట్రా, ఎప్పుడూ అలా ఉంటావ్..." అని నోటివరకూ వచ్చిన మాటను దిగమింగి, అలా అడిగితే, ఏమనుకుంటాడో అని అడగడం మానేసేవాడు. ఒకరోజున ఆ ముసలమ్మ కూడ "ఇక అబ్బాయిగారికి పెళ్లి చేసేస్తేనేగాని వీల్లేదండీ. తల్లి వుంటే రోజూ మీకీ విషయాన్ని ఆమె గుర్తు చేస్తూ, సరియైన సంబంధం మీచేత వెదికింపించేది. ఇక మీరు ఆ బాధ్యత నెత్తిని వేసుకోక తప్పదు. ఈ విషయంలో నేను తమకు సలహా యిచ్చేపాటిదాన్ని కాను. కాని అబ్బాయిగారి ముఖభావం చూస్తూ వుంటే నాకేమిటో బెంగగా, భయంగా ఉంటోంది. ఈ వయసులో కుర్రవాడు ఎంత ఉల్లాసంగా వుండాలో అంత ఉల్లాసంగా ఉండడంలేదు. ఇలా కొన్నాళ్లు సాగితే, అనగూడదు కాని, అతని మతికూడ చలించవచ్చు. చక్కని చుక్కను వెంటనే వెదకి మీరు ఎంత త్వరలో ఆ మూడు ముళ్లూ వేయించేస్తే అంత శుభం. మీ మగవాళ్ళకేమీ పట్టదు. ఇన్నాళ్ళనుంచి ఎప్పుడు చెప్పుదామా ఎప్పుడు చెబుదామా అనుకుంటూనే ఆయనకు మాత్రం ఇది తెలియదా అని నెట్టుకుంటూవచ్చేశాను" అంది.

ఈ మాటలు, ఏమేమి జ్ఞాపకాలకు దోహద మయ్యాయో కాని, ఆ ముసలాయన పాపం కన్నీళ్ళు పెట్టుకున్నాడు. "ఏమిటోనండి...నాకూ చాలా భయంగా ఉంది. నాకేమీ పాలుపోవడంలేదు. అయినా మీరన్న దే నిజం. చిన్నవాడు...

అప్పుడే వాడికి పెళ్ళేమిటి అనుకున్నాను” అన్నాడాయన గద్గదికంగా.

అప్పుడా ముసలమ్మ “అవును బాబూ ... పెళ్ళాం వచ్చిన తరువాత మన బాబు ఎంతిదిగా మారిపోతాడో చూడండి ... అబ్బో ... అతన్నప్పుడు పట్టుకోలేం ...” అంది.

ఈ మాటలు ఆ ముసలాయనకు ఎంతో మానసికమైన బలాన్ని చేకూర్చాయి. అంతే ... ఇక పెళ్ళి జరగడం ఎంతలో పని ...

ఒక రోజున ఆయన శంకరాన్ని విజయనగరం తీసికెళ్ళి శాంతను చూపించాడు. శంకరం శాంతను చూసీ చూడగానే పెళ్ళికి ఒప్పేసుకున్నాడు. శాంత కూడ అంగీకరించింది. పెళ్ళి దివ్యంగా జరిగిపోయింది.

## 3

అప్పటినుంచీ శంకరం భార్యను విడిచిపెట్టి ఒక్క క్షణం ఉండేవాడు కాదు. చాలసార్లు ఆమెతో ఆ ఉద్యోగానికి స్వస్తి చెప్పేస్తాననేవాడు. గొప్పవాడైన తను, ఆ ఉద్యోగం ఒక పేదవానికి వదులుకోవడం ఎంతో ఉత్తమమైన పని అనేవాడు. ఆఫీసులో తనంటే ఎవ్వరికీ కిట్టదు అనే వాడు.

కాని, శాంత అతని మాట వినలేదు. ఉద్యోగం ఎప్పుడూ మానగూడదు అంది. అందులో ఉండేటటువంటి సాధక బాధకాలు మీరు పూర్తిగా అర్థం చేసుకోవలసిందే అంది. ఇంటి దగ్గర కూర్చుని, మీరు నిద్రపోతే, మీరు తప్పక ప్రపంచానికి దూరమైపోవలసి వస్తుంది. ఈ ఉద్యోగం మాత్రం మీ రెంతమాత్రం విడిచి పెట్టడానికి వీల్లేదు అని గట్టిగా చెప్పింది.

ఆమె అన్న ఈ మాటకు వ్యతిరేకంగా చెప్పడానికి శంకరానికి గుండె చాలలేదు. కాని, ఆ ఉద్యోగం మానెయ్యాలని అతని మనసు నిండా ఉంది. అయినా అతనీమాట చెప్ప లేకపోయాడు. చెప్పలేక పోవడమంటే 'భయపడటం కాదా ఏమిటి ? అని గ్రుచ్చి గ్రుచ్చి అడిగే మనసుకు అతను ఏమీ నచ్చజెప్పలేక పోయాడు.

అసలే శాంత అద్భుత శోభాయమాన! ఆ సౌందర్య సీమలో, సహస్ర ముఖాల ఆకర్షణీయమైన ఆ ఆరామంలో ప్రేమానురాగాల మేళవింపుల ఆ మైదానంలో సుఖంగా నివసిస్తూ, సుఖంగా విహరిస్తూ, సుఖంగా ప్రయాణం చేయడమే తన కత్యంత ఇష్టహేతువైన విషయం అన్నసంగతి అతను త్రోసిపుచ్చలేక పోయాడు. ఆమె కనుసన్నల తన జీవితం పలయ మారుతమై ఆకసాన్ని చుంబిస్తూంటే, ఆమె పలికే పలుకులు, ఆమె కదిలే కదలికలు, ఆమె చెప్పకయే చెప్పు ఆ సుందర భంగిమల అంతర్లీనమైనట్టి భావ తరంగముల

అర్ధవిన్యాసములు హృదయానికి గిలిగింతలు పెడుతూంటే— ఆమె ఆనతి కిట్లా జవదాటాలో అతనికి తోచేది కాదు.

శంకరానికి శాంతను విడిచి ఉండాలని ఉండదు. కాని, పాపం ఉండక తప్పడం లేదు. ఆమెను విడిచి ఆఫీసుకు వెళ్ళ డానికి అతని కెంత కష్టం! వెళ్ళినవాడు ఇంటికి పోయే వేళ కోసం, ఆ సమయం కోసం, ఆ కచేరీ పుట్టలో ఆచరించే తప స్సుకు వరాలిచ్చే ఆ ఐదు గంటల దేవత ఎప్పుడవతరిస్తుందా అని అతను పడే అవస్థ ఏమని చెప్పగలం!

ఇంటికి వచ్చిన వెంటనే అతనికి కనిపించాలి. ఆమె చిరునవ్వుల స్వాగత వచనాలు వినిపించాలి. ఆమె స్వాగ తాలకు, అతను మూగభాషల భాష్యకర్తగా ప్రసిద్ధికెక్కాలి!

## 4

కాలం పిల్లల్ని తన భుజాలమీద ఎక్కించుకొని మహోత్సాహంతో ముందుకు సాగిపోతోంది.

శాంత పాపను ప్రసవించి అప్పటికి నాలుగు సంవత్స రాలు దాటిపోయింది. నాలుగు సంవత్సరాల పాప, శంక రాన్ని నాలుగు సంవత్సరాల అబ్బాయిగా మార్చేంది.

పాప, శంకరం హాయిగా ఆడుకొనేవారు. చిట్టి చిట్టి పాటలు పాడుకొనేవారు. చిలిపి చిలిపిగా నవ్వుకొనేవారు.

"పాపాఁ..." అంటే "నాన్నాఁ..." అంటూ పాప చెంగున లేడిపిల్లలా తండ్రి వద్దకు రివ్వున వచ్చేది. శంకరం రెండు చేతులతోనూ పాపను తీసికొని, గాలిలోకి సుమారుగా ఎగరేసి, గబాలున పాప బుగ్గలు ముద్దు పెట్టుకుంటూ, చేతుల లోనికి తీసుకునేవాడు. పాప తన కాళ్లూ, చేతులూ కిలకిలా నవ్వుతూ కదిపేది. తండ్రి తన పెదవులతో పాప పొట్టమీద కితకితలు పెట్టేవాడు. కిలకిలాగు నవ్వుల పాప, శంకరం తలను తన చిట్టి చేతులలోనికి తీసికొని నానా భీభత్సం చేసేది. అప్పుడే శాంత అక్కడకు వచ్చేది. "పాపా... ఏమిటే ఈ ఆగడాలు..." అనేది. పాప "చూడిమ్మా... నాన్న..." అనేది. నాన్నను కొడతా నన్నట్లుగా వ్రేలు పెట్టిచూపుతూ, కన్నులలోంచి నవ్వునుచిందేది. "ఏమిటండీ మీకు దానితో... మిమ్మల్ని చూసుకునే అది మరీ మొద్దుబారిపోతోంది" అనేది. శాంత. శంకరం శాంతమాట వినేవాడు కాదు. "పాపా... మనిద్దరమూ జట్టుకదూ... అమ్మదగ్గరకు పోకేం ..." అనే వాడు. పాప, 'అమ్మాఁ... ఉహు... నేనమ్మదగ్గర కేపోతాను' అనేది. వెంటనే శంకరం "అదికాదు పాపా... నిన్నుసినిమాకు తీసుకెళ్తాను. నాతోనే ఉంటావామరి... 'అనేవాడు. పాప అమ్మవైపు అదోలా చూస్తూ, నాన్న సినిమాకు తీసికెళ్తాడో వెళ్లడో అని శంకిస్తూ, "ఉత్తినే" అనేది. శాంత, "దానికి తెలియదటండీ... మీఅబద్ధాలు ... రా... పాపానీకు మిఠాయి పెడతాను అంటూ చేతులు చాచేది. 'అయితే రావా పాపా

...సినిమాకు... అనేవాడు శంకరం. పాపం పాపకు మిఠాయి కోసం అమ్మదగ్గరకు పోవాలనీ వుండేది. సినిమాకోసం నాన్న దగ్గర ఉండిపోవాలనీ ఉండేది. ఆ పసిదానికి ఆ సమయంలో ఏమిచెయ్యడానికీ తోచేదికాదు. ఇదే అదను అనుకొని శంకరం "పో... మీ అమ్మదగ్గరికేపో...నువ్వు నాతో సినిమాకు రానక్కర్లేదులే...అనేవాడు. దానితో పాప తండ్రి చేతుల్లోంచి అతను ఎంతగట్టిగా పట్టుకున్నా ఆగకుండా క్రిందికి జారిపోయి గచ్చుమీద కూర్చుని ఒకకాలు గచ్చుమీద రాస్తూ, రెండుచేతులూ బొమ్మలా కదుపుతూ, 'ఉ... ఉ... నేను సినిమాకి వస్తాను... సినిమాకు వస్తాను...అని ఏడుపుకు లంకించుకునేది. వెంటనే తల్లి తన రెండు చేతులతోనూ, పాపను తియ్యగా ఎత్తుకుంటూ, "నాన్నతో మనం అసలు వెళ్ళనేవద్దు...మనమే వెళ్దాం, సినిమాకు ఏం" అనేది. అంత ఏడుపు ఎక్కడికి మాయమైపోయేదో..."చూశావా జయించాను." అన్నట్లుగా పాప,వాళ్ళ నాన్నవైపు చేయెత్తి వ్రేలు చూపుతూ కడుపునిండా నవ్వేది. అప్పుడు తండ్రి, "ఫో... దొంగముండా..." అనేవాడు. పాప, "నువ్వేపో..."అనేది శాంత జయించినట్లుగా కళ్ళల్లో నవ్వును వెలిగిస్తూ శంకరం వైపు తమాషాగా చూసి, మేడదిగిపోయేది.

# 5

కాలానికున్నంత నిశ్చితమైన దృఢ సంకల్పం మనసు కెప్పుడూ లేదు. కీడొచ్చినా, మేలొచ్చినా కాలం లక్ష్య పెట్టకుండా ముందుకు సాగిపోతుంది. మనసుమాత్రం మేలు కలిగితే మేడెక్కుతుంది: కీడు కలిగితే కృంగిపోతుంది.

ఆవేళ ఆకాశంనిండా మబ్బులు క్రమ్ముకొన్నాయి. అప్పుడు శంకరం ఆఫీసులోనే ఉన్నాడు. కుత కుత ఉడికించిన వేసవి నెత్తిమీద దబదబ వర్షం కురిసింది. పట్టపగలు చిట్ట చీకటయింది. హోరున గాలివీచి, ఇంక అనవసర మన్నట్లుగా గుమ్మాల వ్రేలాడదీసిన వట్టివేళ్ళ తడకలను అవతలకు విసిరేసింది. వేడెక్కిన గాలి చల్లబడింది. చల్లబడిన గాలి చల్లగా హృదయాలకు తాకింది. చల్లని గాలితో చల్లని వర్షం ఒకటే కుండపోతగా కురిసింది. గాలిలో వర్షం, వర్షంలో గాలి కలసి మెలసి చేయి చేయి కలుపుకొని, హాయి హాయిగా చెట్ల మీద, భూమిమీద నృత్యం చేశాయి. కాల్వలుగా పారిన వర్షపు నీటిలో పసిపిల్లలు వదలిన తమాషా తమాషా కాగితపు పడవలు వారి వారి లే ఎడకట్టై ప్రయాణాలు చేశాయి. దారుణమైన ఎండలో పేలాలుగా పేలిపోయిన మనుషులు ఈ వర్షంతో మొగాలు ఇంత చేసుకున్నారు.

ఎంత వర్షం! ఎంత వర్షం! రెండు గంటలు నిర్విరామంగా కురిసిన వర్షం ఒక్కసారి వెలిసింది. ప్రాయుదలుచు

కొన్నది వ్రాసిన పిమ్మట నిర్మలమైన కవి మనసులా ఆకసం తేలిక పడింది.

తారురోడ్లు, సిమెంటు రోడ్లు మినహా... వీధులన్నీ బురద బురదగా మారి అసహ్యంగా ఉన్నాయి. రోడ్లమీద అక్కడక్కడ ఆమాత్రం సుఖం అనుభవించిన మీదట ఈ మాత్రం కష్టానికి సిద్ధపడాలి అన్నట్లుగా గాజు పెంకులు, గుర్రపు నాడాలు తేలాయి. వర్షం కురిసినంతసేపూ శంకరం ఆఫీసులోనే ఉండిపోయాడు. అది వెలిసిన వెంటనే ఇంటికి సైకిలెక్కి బయలుదేరాడు.

అప్పుడు చల్లగాలి వీస్తోంది. ఆకసంలో ఇక్కడో చుక్క, అక్కడో చుక్క కళ్ళు నులుపుకుంటున్నాయి. చంద్రుడున్నాడుగాని, స్విచ్ వేయని బల్బులాగ పాలిపోయిన మొగంతో సమయంకోసం ఎదురు చూస్తున్నాడు.

ఇంతలో శంకరం త్రొక్కుతూన్న సైకిలు ట్యూబ్ ఒక్కసారి టప్ మని పేలి, అందులోని గాలి తుస్సున బయటకు పోయింది. శంకరం ఎప్పుడూలేంది ఇలా జరిగిందేమిటి అనుకుంటూ సైకిలు దిగి ఇంటికి నడక సాగించాడు. సైకిలు దిగి నడుస్తూంటే అతనికేదో ఆకసం మీంచి క్రిందికి దిగిపోయినట్లనిపించింది.

శంకరం ఇంటికి వెళ్ళేసరికి చీకటి పడింది. చీకటి పడటమంటే చీకటి వుందనికాదు. వీధిలో వెన్నెల వుంది. ఇంటిలో విద్యుద్దీపముంది. ఈ ఆలస్యానికి జవాబు వర్షమే చెబుతూంది

దానికి సైకిలుకూడ సాక్ష్యముంది. సాక్ష్యంమాట గుర్తు రాగానే శంకరానికి నవ్వు వచ్చింది. నవ్వుకుంటూ శంకరం గుమ్మమెక్కాడు. గదిలో సైకిలు పెట్టి లోనికి పోబోయాడు. అప్పుడే... అక్కడ...

"అరె... చెప్పా చెయ్యకుండా మీరు లోనికెలా వచ్చే శారు..." అంది శాంత.

వెంటనే పాప, "నాన్నారూ... నాన్నారూ... పంతు లమ్మగారండి... నాకు చదువు చెబుతారటండి..." అంది ముచ్చటగా.

అబ్బ! ఎంత అందకత్తె! శాంత ప్రక్క నిలచిన ఆ అమ్మాయి... శాంతను మించిపోయిన ఆ అమ్మాయి... ఓహో! సౌందర్యానికి సౌందర్యం... అక్షరాలు పొదగలేని అద్భుతసృష్టి... "ఈ అమ్మాయి... ఈ అపురూప లావణ్యవతి పంతులమ్మా... అబ్బ!" ఏమిటో మనసులోని దిగ్భ్రమ! క్షణం చూడలేదు...క్షణం నిలువలేదు. ఇద్దరిలో ఏ ఒక్కరు క్షణంలో సగంకన్న ఎక్కువసేపు చూసుకోలేదు. అంతే- ఆమె వెళ్ళిపోయింది. మాయ మైపోయింది. అతనిలోని సమస్తాన్నీ తీసుకొని అంతర్ధాన మైపోయింది. ఆ కన్నులు, ఆ కనుబొమలు, ఓహో!... శంకరం ఒక్కసారి శాంతను మరచిపోయాడు. అతను ఒక్కసారి ఈ ప్రపంచాన్నే మరచిపోయాడు.

'వర్షం ఎప్పుడో వెలిసిపోతే ఇంత ఆలస్యంగా వచ్చే రేం...' శాంత ప్రశ్న శంకరం చెవిని సోకనే లేదు.

'ఎవరు శాంతా... ఆ అమ్మాయి'... శంకరం గుండె లోని ఉత్కంఠ ఆగలేదు. ఆపుకోవాలనుకున్న ప్రయత్నాన్ని అది అణచేసి పైకి ఉబికింది. పెదవుల్లోంచి తియ్యగా నవ్వు వచ్చింది. ఆశగా జాలిగా గోముగా ప్రశ్నించింది.

'ఎవరో పాప చెప్పిందిగా...' శాంత నవ్వింది.

'అబ్బె...అంటే నా అర్థం అదికాదు.' శంకరం నాలుక తడబడింది. గుండె కొట్టుకుంది. మొగం లిప్తలో ఏవేవో మార్పులు చెందింది.

'ఎందుకంత కంగారు...ఇంక రోజూ ఇక్కడే వుంటుంది లెండి.'

'ఈ మాటలు శాంత నిజంగానే అంటూందా ... అబద్ధం... ఔను... వేళాకోళం...అబ్బ! నిజంగా శాంత మాటలు నిజం కాకూడదూ... ఆమె యిక్కడే వుండిపోకూడదూ... వుంటే ఎంత బాగుండును. బాగా వుంటుంది కాబట్టే వుండ దేమో... ఏమో ఏది నిజమో...'

శంకరం చూపులు శాంత పలికే పలుకుల్ని అనుమానిస్తున్నాయి. నిజమేనని ఆనందిస్తున్నాయి. సత్యాసత్యాల మధ్యపడి అయోమయమై పోతున్నాయి. కాని వెంటనే శంకరం తన స్థితిని తాను తెలుసుకున్నాడు. ఏదో పొరపాటు

చేస్తూన్నట్లు మనసులో గ్రహించాడు. వెంటనే మాట మార్చాడు.

'రోడ్డుమీద గుర్రపునాడా గ్రుచ్చుకొని సైకిల్‌ట్యూబు పగిలిపోయింది' అన్నాడు.

'సైకిల్ ట్యూబు పగిలితే ఫరవాలేదు. హృదయం పగిలి పోయిందంటేనే చిక్కు' శాంత పకపక నవ్వింది.

వెంటనే శంకరం 'అబ్బే ఇక లాభం లేదు' అనుకొన్నాడు. శాంత నిప్పు డేమడిగినా జవాబులు పెల్లేరుకాయలై కూర్చుంటాయి. తిన్నగా సమాధానాలిచ్చే పరిస్థితి చేయి జారిపోయింది. అనుకొన్నాడు. 'కాస్త ఓపిక పడితే రాత్రికి అన్ని సంగతులూ వాటంతటవే బయట పడకపోతాయా ఏమిటి' అనుకుంటూ మేడమీదికి చల్లగా జారుకున్నాడు.

'ఇక ఈ వస్త్రావన ఆమె ముందు తేగూడదు. ఆమె చెప్తే చెపుతుంది. లేకపోతే లేదు...' అని నిర్ణయించుకున్నాడు.

అలా నిర్ణయించుకున్నాడే కాని ఆ విషయం తెలుసుకోకుండా వుండగలడం ఎలా అనుకున్నాడు. ఆమెను ఏదో విధంగా ప్రశ్నించా లనుకొన్నాడు. ఆ అమ్మాయిసంగతి అడిగినట్లుగా కాక ఆ అమ్మాయి సంగతే అడిగినట్లుండాలి అనుకున్నాడు. అబ్బే... అదికాదు...ఆఅమ్మాయి సంగతి ఏరూపేణా ధ్వనించబడరాదు, అనుకున్నాడు. ధ్వనించరాదు అనుకుంటే ధ్వనించబడకుండా 'వుంటుందా... అతని గుండెనిండా ఇదే

ధ్వనిస్తోంది. అతని మనసునిండా యిదే చరిస్తోంది. అతని ప్రత్యణువునా ఇదే కదలుతోంది. ఏమి మాట్లాడాలన్నా ఆమె నుద్దేశించే వస్తోంది అబ్బ! మనసును నొక్కిపట్టి బుద్ధిని సానబట్టి ఈ స్థితిలో నిలబడగలగటం ఎంత కష్టం!

అప్పుడే శంకరాన్ని అతని మనసు ఇలా అడిగింది... 'ఎందుకు శంకరం అంత తొందర? ఆ అమ్మాయి ఎవరో పరాయి పిల్ల. పరాయి పిల్ల సంగతి పరాయివాడికి ఎందుకు? నువ్వింత మంచివాడవు కదా... నీ కెందుకా అమ్మాయి సంగతి? ఏమిటో నీ సంగతి నాకేమీ నచ్చలేదు. నువ్వు వదులుకోవలసిన గుణాలు కొన్ని వదలుకోవడం లేదు.

శంకరానికతని మనసుమీద కోపం వచ్చింది. అయినా ఏమి చేయగలడు. 'ఛీ... నాకలాంటి తుచ్ఛమైన భావాలు ఏ కోశానా లేవు' అన్నాడు. అనడమంటే అన్నాడేగాని ఇది నిజమా అన్న ప్రశ్న ఎదురై ఎందుకో తబ్బిబ్బయ్యాడు.

అప్పుడే శాంత మేడపైకి వచ్చి 'భోజనంకూడా మరచి పోయినట్లుందే... ఎప్పుడూ లేంది కబురుకూడ కావలసివచ్చిందేం...' అలా అని వెంటనే మేడ దిగిపోయింది.

శంకరం వూహల్లో తప్పుడు భావాలున్నప్పటికీ అతను లోకం ఇంత తప్పుగా వూహిస్తుందేం—అనుకున్నాడు. తనపై శాంత కిలాంటి అపోహలుంటే ఇప్పుడే జాగ్రత్త పడాలనుకున్నాడు. వెంటనే అతనిలోని కెక్కడలేని గాంభీర్యం వచ్చి పడింది. అత నిప్పుడు నిజంగా పరస్త్రీ వాంఛా రహితుడు! చెప్పలేనంత పరిశుద్ధుడు! ఊహించ నలవిగానంత పరమపవి

ర్శుడు! శాంత, మేడదిగి వచ్చి శంకరాన్ని చూచి, ఆశ్చర్య పోయింది.

అతని మొగంలో వెలుగుతూన్న వింత తేజస్సుకు భక్త్యంజలి పట్టింది. అట్టి మాటలతో శంకరాన్ని—అంతటి సచ్ఛరిత్రుణ్ణి హింసించడం ఎంత ఏహ్యమైన విషయం అను కుంది. ఆ పంతులమ్మ ఎవరో తెలుసుకోవాలనే ఉత్కంఠ మినహా—అతనిలో తదితరమైన వికారసంబంధమైన వూహాలు వుంటాయనే ఆలోచనలు పరమ నీచమైన వనుకుంది. తన ప్రియుణ్ణి, తన హృదయంలోని మూర్తిని, అట్లా తప్పు పట్టడం అట్టి మాటలతో అతన్ని హించించడం, క్షమించతగ్గ విష యంకాదు అనుకుంది. పెద్దర్థాలు వచ్చేట్లు తను మాట్లాడిన మాటల కాయన ఎంత బాధపడ్డారో అని మనసులో మధన పడింది. ఇంమకా భోజనం చెయ్యాడానికి మేడదిగి రాలేదు... అయ్యో! వారిగురించి నేను ఎటువంటివూహాలు వూహించాను ఇప్పుడే క్షమాపణ కోరాలి... ఔను... అనుకుంది.

మెల్లగా అతని దగ్గరకు చేరింది. 'నేనన్న మాటలకు మీకు కోపం వచ్చిందా...' అంది. పాపము భర్త హృద యాన్ని క్షణము కూడా తరచి చూడలేని ఆ అమాయిక ! అతని నిసుమంతకూడ బాధించ నిష్టపడని ఆచల్లని వెన్నెల వాక !

వెంటనే శంకరం సూక్ష్మాతి సూక్ష్మంగా దృష్టి సారించి, ఒకే ఒక్క చిన్ననవ్వు 'శాంత ఎంత అమాయిక' అన్న అర్థంతో నవ్వి, వెంటనే తమాయించుకొని, శాంత ఈ

నవ్వులోని అర్థాన్ని పసిగట్టక ముందే ఆ నవ్వును వ్యంగ్యార్థముగా ధ్వనించి '''పోనీ శాంతా ఇందులో కొంప మునిగిపోయేదేముంది... సరే అన్నము పెట్టు అన్నాడు.

శాంత అతని మనోగత విషయాన్ని గుర్తించలేక పోయింది శంకరం బాధ యింకా వుపశమించ లేదని వూహించింది. అప్పుడేమి మాట్లాడాలో తోచక మాటా మంతీ లేకుండా భోజనం వడ్డించింది. ఫేన్ స్విచ్ వేసి, దగ్గరగా కూర్చొని, 'పాపం ఆ అమ్మాయి చాల పేదపిల్లండీ... పేరు కావేరి... ఇంకా పెళ్లి కాలేదట... వంటరిగానే వుంటోందిట... చాలా మంచిదిలాగే కనిపిస్తోంది. అబ్బ! ఎంత బాగా మాట్లాడుతుందనుకున్నారు. మన దొడ్డిలో వున్న ఆగది అద్దెకు ఇమ్మని బ్రతిమాలిందండీ...ఆగది మీరెవ్వరికీ ఇవ్వొద్దన్నారుగా... వారు కోపగిస్తారు... ఇంకెక్కడైనా చూసుకో ...అన్నాను...' అంటూ శాంత ఏదో జ్ఞాపకము వచ్చినట్లుగా లేచి పెరుగు తీసుకురావడానికంటూ వంటగదిలోకి వెళ్లింది.

శంకరం ఒక్కసారి తనను తనే నిందించుకున్నాడు. ఆగది తను అద్దెకు యివ్వవద్దని ఇంట్లో హుకుం జారీ చేసినందుకు చాల బాధపడ్డాడు. పోనీ శాంత ఆమాత్రం అధికారం తీసుకుంటే తను అడ్డు పెడతాడా... శాంత ఏమిటో మరీ పిచ్చిది. తను ఆగది అద్దెకివ్వొద్దన్నాడంటే, అంత చిన్న గదిలో వుండేవాళ్లు పట్టి అలగాజనమే అయి వుంటారు

కాబట్టి వాళ్ళేవేవో గొడవలు పడుతూ ఇక్కడ ప్రశాంత వాతావరణం కలుషితం చేయొచ్చు కాబట్టి తను అలా అన్నాడేగాని, ఇలా ఇంత మంచి అమ్మాయి, సుమారుగా శాంత అంతవున్న అమ్మాయి...యీవిధంగావచ్చి ప్రాధేయ పడితే ఇవ్వొద్దంటాడా... అంతులో ఆ అమ్మాయి వంతు లమ్మ కూడాను... వంటరి దాన్నేనని చెప్పింది కూడాను... అలాంటప్పుడు ఆమెను వుండమని చెప్పడానికేం పోయింది? ప్చ్... ఏమిటో నేను కన్న కలలు యదార్థ మవుతూ అవుతూ ఇట్టే అంతర్ధానమై పోతున్నాను.

నా అంతరాళంలోని వూహాసుందరి, ఇలా చేజిక్కి నట్లే చిక్కి మళ్ళా దూరమై పోవడానికి నేనేం పాపం చేశానో...

శంకరం ముఖంలో తీరనివ్యథ ముద్ర కొట్టుకొని, గొంతుకలోనికి ముద్ద మింగుడు పడకుండా చేసింది.

అప్పుడే శాంతవచ్చి 'ఎంత బతిమాలిం దనుకున్నారు. తను ఈ వూరికి క్రొత్త అని, ఎలాగో వోలాగ మీకు నచ్చజెప్పి తప్పక ఈఇంట్లో వుండేట్లు చేయమని బతిమాలిం దండి...' అంటూ శాంత శంకరం ముఖంలోకి చూసింది. చూసి, 'ఏమండి ఒప్పుకోమంటారా... రేపొద్దున్న వస్తా నంది...' అంది.

శంకరానికి విషమ సమస్యవచ్చింది. అబ్బ! తనను శాంత ఎలాంటి చిక్కులలో పెడుతుంది! తను ఇప్పుడేం

చెప్పాలి ? 'సరే...'అంటే శాంత ఏమను కుంటుందో... సరే అనకపోతే పాపమూ కావేరి ఏం ఇక్కట్లు పడవలసి వస్తుందో కొంపతీసి శాంత తన్ను పరీక్ష చేయుడంలేదుకదా... శంకరం, శాంత కన్నులలోకి పరీక్షగా చూశాడు.

'ఒప్పుకోండీ... పాపం మంచి మనిషిలావుంది... ఆ అమ్మాయి ఇక్కడ వుంటే మనపాపకు చదువుకూడావస్తుంది' అంది. శంకరం తేలిక పడ్డాడు. మామూలు ధోరణిలో అన్న ట్లుగా 'సరే... నీ ఇష్టం' అని భోజనం ముగించి, మేడమీ దికి సరాసరి దారితీశాడు.

## 6

ఓ సుముహూర్తాన, తెల్లవారుఝామున కావేరి ఆగ దిలో ప్రవేసించింది. ఆగది ఆమె రాకతో ఎక్కడలేని అం దాలను సంతరించుకుంది. ఆమె చక్కగా సామానుసర్దుకుంది. ఇల్లుచూసి ఇల్లాలునుచూడు అన్న సామెతలోని అర్థానికి మెరుగులు దిద్దింది. మల్లెపూలవంటి బట్టలు కట్టింది. సన్నగా కళ్ళకు కాటుక పెట్టింది. నుదుట మోహనంగా తిలకం దిద్దింది. అడుగడుగునా వినూత్న శోభ నొలకబోస్తూ ఆరోజున తన ఇంటికి శాంతను భోజనానికి ఆహ్వానించ డానికి చక్కగా బయలు దేరింది.

అసలే ఆమె అందానికి విస్తుపోయిన శాంత, ఆమె నీ వేషంలో చూసి మరింత అబ్బుర పడిపోయింది. అయ్యో ఇంత యౌవనమూ, ఇంత సౌందర్యమూ అడవికాచిన వెన్నెలకదా అని మనసులో కలత చెందింది. ఈ అమ్మాయికి తను తన చేతులతో పెళ్ళిచేస్తే తన మనసు కెంతో హాయిగా ఉంటుందని ముచ్చట పడింది. ముచ్చటైన యీ భావంతో శాంత, సుమనోహరంగా నవ్వి, "ఏమండీ పెళ్ళికూతురు గారూ... ఇలా బయులుదేరారు... సామానులన్నీ సర్దుకో వడ మైందా..." అంది.

ఈ మాటతో కావేరి మొగం అదోకలా మారిపో యింది. ఒక్కసారి ఆమె మొగంలోని మోహనత్వమంతా చెదరిపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. ఆమె ఏమో చెప్పాలనుకుంది. కాని ఏమీ చెప్పలేకపోయింది.

శాంత "అరె... అదేమిటి కావేరీ... ఇంతలో ఇంత మార్పేమిటి..." అంది.

కావేరి, "ఏమీలేదండి... మీరామాట అనగానే మా అమ్మ జ్ఞాపకానికి వచ్చిందండీ..." అంది.

"కష్టా లెప్పుడూ కాపురముండి పోవులే కావేరీ... నిన్ను చూస్తూవుంటే నాకేమిటో ఈ చేతులతో ఓ యింటి దాన్ని చెయ్యాలనిపిస్తోంది. నిజాని కెప్పుడో అంతపని చేసి

పూరుకుంటాను కూడాను. కాని ఇంత అందగత్తెకు తగ్గ అంద గాణ్ణి వెదకడమే కష్టమైన పని” అంది.

కావేరి ఈ మాటలకు నవ్వలేక పోయింది. పాపం మెల్లగా, "ఇంకా నాకు పెళ్ళేమిటండీ. ఇలా ఎప్పుడో ఒకప్పుడు హాయిగా ప్రాణాలు విడిచేస్తే అదే పదివేలు. నాకంతకన్నా ఇంక ఏకోరికా లేదండి..."

వెంటనే శాంత ఎంతో కోపంతో "అదేమిటి కావేరీ నువ్వీ జీవితంలో అప్పుడే ఏమి చూశావని, అంత నిరాశ. మంచి దానవే. ఇప్పుడంటే అన్నావు గాని ఇంకెప్పుడూ అలాంటి మాటలు నా దగ్గర అనబోకు"

ఈ మాటలతో కావేరి, వచ్చినపని మరచి పోయింది. కావేరి, శాంత ఇంచుమించు సమ వయస్కులే. కాని, శాంత ముందు కావేరి చిన్నదానిలా ఉంటుంది. ఎంతో పొంకంగా ఉంటుంది. శాంత చూపిస్తూన్న ఈ ఆదరణకు ఈ ఆప్యాయతకు కావేరి మనసు ఆమె ఎడల వినమ్రతతో తలను వంచింది. ప్రియమిత్రుల, ఆత్మీయుల సన్నిధి నున్నట్లు అతి నిర్భయంగా తలను ఎత్తింది. కాని... కాని... అదేమిటోగాని శాంత ముందు ఆమె ఎందుకో న్యాయాధికారి ముందు నిలచి నట్లు గజ గజ వణికింది. భోజనానికి పిలవా లనుకున్న శాంతను వెంటనే భోజనానికి పిలవలేక పోయింది. శాంత కట్టిన పెద్దపెద్ద జరీఅంచుల పట్టుచీర, ధరించిన వినూత్న మణిమయ కంఠహారాలు రూప లావణ్యాల తేజస్సు ఆగదిలో

అంతటా కనిపించే అతిసుందర వస్తు ప్రదర్శనల అద్భుత కళా సృష్టి, ఆమె కంఠమునుండి ఆ పిలుపును పైకి రానీయు లేదు. 'అమ్మో నే నెక్కడ... శాంత ఎక్కడ... అమెకు నాకూ సంబంధ మేమిటి...'అనుకుంది. కాని, శాంత మొగం లోకి ఈ భయంకర భావాల విచ్చుకత్తుల నడుమనుండి ఒక్క-సారి తల ఎత్తి చూసింది. అక్కడ అతి ప్రశాంత మందస్మిత మధురోక్తుల మాధుర్యము, కారుణ్య రస స్వరూప సౌందర్యము, అచ్ఛమైన హృదయములోని వూహించ నలవిగాని చల్లని వెన్నెలల ప్రవాహ ప్రాభవము... ఇవే...ఇవే కానవచ్చాయి. ఒక్కసారి కావేరి మనస్సు ఉర్రూత లూగింది. ఆమె హృదయం పూర్తిగా సంతృప్తి పడింది. ఆమె లే ఎద చెప్పలేని సుఖాన్ని అనుభవించింది. ఆమె మెల్లిగా 'ఈపూటకు మీరు మా ఇంట్లో భోజనం చెయ్యాలి...' అంది. పాపను దగ్గరగా తీసుకొని ముద్దు పెట్టుకుంది. శాంత కళ్ళల్లోకి ఆశగా చూసింది. శాంత చిక్కగా నవ్వి, 'ఒక్క పూటేనా...' అంది. అని, 'పిచ్చిదానా... ఎందుకివన్నీ...'అంది. పంతులమ్మ తనను తాను మరచిపోయింది. 'సరదాగా మనిద్దరం ఈ రోజున భోజనం చెయ్యాలండీ... మీరు కాదనగూడదు...'అంది. కాని శాంత సరే ననలేదు. రానన్నీ అనలేదు. ఆమె ఆలోచిస్తున్నదో కావేరికి అర్థం కాలేదు. 'ఏమండీ...' అంది; తిరిగి బ్రతిమాలుతున్నట్లు. శాంత మరి తప్ప దనుకున్నదో ఏమో... ఒక్కసారి కావేరి కళ్ళల్లోకి చూసి, అక్కడ ఏమి టేమిటో తెలుసుకుంది. 'సరే

నీమాట తీసెయ్యడమేం... ఏం పెడతావో చూస్తానుగా... అంది. కావేరి క్షణంలో కొండంత అయింది. తన మనసులో ఎంతో ఆనందించింది. 'సరే... వస్తానండీ...' అంటూ గభాలున లేచింది. అప్పుడే శాంత, 'ఇదిగో అమ్మాయ్... నేను వస్తానన్నానని నువ్వేమిటో విపరీతాలకు దిగావంటే, నేసగంలోనే లేచిపోతాను తెలుసా...' అంది. 'అబ్బా అలాగే పాపం...' అన్నట్లుగా కావేరి ఓ నవ్వు నవ్వేసి తన గదివద్దకు పారిపోయింది.

అలా పరుగెడుతూన్న కావేరిని, నిండు యౌవనంతో పొంగి పొరలి పోతూన్న ఆ కావేరిని, శంకరం మేడ మీంచి అలాగే రెప్పవాల్చకుండా చూశాడు. ఆమె వెళ్తూన్న ఆ మార్గమంతా పూల రాసులతో నింపబడి ఉంటే ఎంతబాగుండును అనుకున్నాడు. ఆమె కనిపించినంత వరకూ అక్కడే అలాగే నిలబడిపోయాడు. ఆమె తన గదిలోకి వెళ్ళిపోయిన తరువాత కూడ అతని కక్కడనుంచి ఏమాత్రం కదలి వెళ్లాలనిపించలేదు.

అప్పుడే పాప అతని దగ్గరకొచ్చి 'నాన్నారూ... అమ్మ భోజనానికి రమ్మంటూందండీ' అని, 'మరండీ...నాన్నారూ... ఆ వేళ మీరు చూడలేదూ...ఆ పంతులమ్మగారండి... అమ్మగారిని భోజనానికి రమ్మన్నారండి అంది.

శంకరం పాపను గబాలున ఎత్తుకొని, 'అలాగా పాపా మరి నన్ను పిలిచింది కాదేం మీ పంతులమ్మగారు.'

అన్నాడు. అన్న వెంటనే, ఏదో స్ఫురించినట్లై 'అమ్మో... పాపదగ్గర జాగ్రత్తగా ఉండాలనుకొని, సరే, పాపా....... మరి నువ్వు ఈ పంతులమ్మగారి దగ్గర బాగా చదువుకుంటావా' అన్నాడు.

వెంటనే, పాప 'మరి ఈ పంతులమ్మగారు కొట్టకుండా ఉంటారాండి...' అంది.

'అవును పాపా... ఈ పంతులమ్మ ఎప్పుడూ కొట్టదు. చాక్లెట్లు, బిస్కట్లు, అన్నీ పెడుతుంది. ఎంత మంచి పంతులమ్మనుకున్నావ్...' అని మళ్ళీ నాలుక కరచుకున్నాడు 'అమ్మో... కొంప మునుగుతుంది. పాప దగ్గర జాగ్రత్తగా ఉండాలి' అని తిరిగి తనను తనే హెచ్చరించుకున్నాడు.

తిరిగి 'కావేరి పిలవకుండానే ఆమె దగ్గరకు భోజనానికి వెళ్ళాలని శాంత నిశ్చయించుకొని, మెల్లిగా పాపను తీసుకొని ఆమె ఉన్న గదిదగ్గరకు బయలుదేరింది. కావేరి వంట పూర్తి చేసుకొని, శాంతను పిలుచుకు రావాలని బయట కడుగు వేయబోయి, ఎదురుగా వస్తూన్న శాంతను చూసి, విస్తుపోయింది. 'అరే... ఇంకా నేను రావాలనుకుంటూంటే మీరే వచ్చేశారే...' అంది. శాంత ఏమీ మాట్లాడ లేదు. ఆమె మొగంలోని సుప్రసన్నతా సౌందర్యశ్రీ చెరిగిపోలేదు. ఇంక, కావేరి క్షణం నిలబడలేదు.

వెంటనే కావేరి, 'కూర్చోండి' అంటూ గబగబా ఇంట్లో ఉన్న మంచం వాల్చింది. 'ఎందుకండి శ్రమయింది...

భోజనమే వడ్డించేస్తాను. కాళ్లు కడుక్కోండి' అంటూ నీళ్లు తెచ్చింది. ఈ తువాలుతో చేయి తుడుచుకోండి. అంటూ తెల్లని టవల్ అందించింది. మా వంటలు మీకు రుచిస్తాయో రుచించవో అంటూ భోజనం వడ్డించింది.

వడ్డిస్తూ వడ్డిస్తూ, బడిలో పిల్లల సంగతి, వాళ్ళకు చెప్పే పాఠాల సంగతీ, మాష్టర్ల సంగతీ, వాళ్ళ చేతుల్లోని బెత్తాల సంగతి ఎన్నో ఎన్నో చెప్పి నవ్వించింది. 'ఇంకొంచెం... ఇంకొంచెం...' అని శాంత వద్దు వద్దంటున్నా తెగ వడ్డించింది. శాంత హృదయం ఈ మర్యాదతో ఉక్కిరిబిక్కిరయింది. 'నన్ను చంపేసెయ్యాలని ఉందేమిటి కావేరి...' అని తియ్యగా కోపగించుకుంది. వెంటనే కావేరి, 'అబ్బ! అలాంటి మాట లనకండి. ఏం పెట్టానని అలా అంటున్నారు. ఈ పాయసం త్రాగనే లేదు. నిజానికి మీ యింటి దగ్గరైతే ఇంతకన్నా ఎక్కువే తింటారు. ఏదో క్రొత్తవాళ్ళింకదూ... ఆమాత్రం బెట్టుసరైనా చూపకపోతే ఎలా అనిగాని, లేక పోతే ఏమిటండీ... అబ్బ తీసుకోండి... చూడండి... మీ ఇంటికొచ్చి నేను ఇంతకు నాలుగింతలు తినకపోతే...' అని పకపక నవ్వింది.

వెంటనే శాంత, 'అమ్మో... నాలుగింతలే. అలాగైతే నిన్ను అసలు పిలవనే పిలవను.'

వెంటనే పంతులమ్మ, 'మీరు పిలవకపోతే మాత్రం నేను రాననుకుంటున్నారేమిటి... మీరు పిలవకపోయినా

నేను వస్తాను. నా కామాత్రం స్వతంత్రం లేదనుకున్నారా... పాప మాదయిపోయిన తరువాత... ఇక మీ ఆటలు సాగవండోయ్...' అంది.

అప్పటివరకూ, పాప పంతులమ్మ చెప్పే మాటలువింటూ, ఆ ఇంట్లోని సామాను పరీక్షిస్తూ వూరుకుంది. కాని, ఆ పసి దానికి ఎప్పటినుంచో వాళ్ళమ్మను ఓ ప్రశ్న వేయాలనే ఉంది. కాని ఎక్కడా వీలు చిక్కడం లేదు. అప్పుడే పంతులమ్మ, 'మీ పాప నయమండీ... అల్లరి చెయ్యకుండా ఎంచక్కా బుద్ధిగా కూర్చుండి...' అని 'ఇంకొంచెం పాయసం త్రాగు పాపా' అంటూ 'ఇదే మరొకరి పిల్లలైతేనా... ఈపాటికి, ఈ ఇంటిని పీకి పాకం పట్టేసేవారు' అంది.

వెంటనే శాంత, 'అప్పుడే ఏమయింది. అది మీ గుట్టుమట్టులు ఇంకా తెలుసుకోందే.'

అప్పుడే పాప, 'అమ్మా... పంతులమ్మగారు చాక్లెట్లు పెడతారన్నారే నాన్నగారు' అంది.

వెంటనే శాంత, 'ఇదిగో కావేరీ ఏమాత్రం దాచి వుంచావో చూసుకో... తయారవుతుంది దోచుకోడానికి...' అంది.

కావేరి, 'మా సొమ్ము మేము దోచుకోవడ మేమిటండీ... పాప మాది. కదూ పాపా... ఇంక ఇక్కడే వుండిపోతావుగా... నీకు చాక్లెట్లు, బిస్కట్లు, బిళ్ళలు, అన్నీ పెడతా...'

పాప బెరుకుగా పంతులమ్మ వైపు చూసి, తిరిగి తల్లి వైపు చూసి, నవ్వింది.

'ఏం... ఇక్కడ వుండిపోతావా పాపా...' అంది శాంత.

పాప తల అడ్డంగా త్రిప్పి ఏమీ మాట్లాడ లేదు.

'అమ్మో చిట్టిపాప... అమ్మ మాట జవదాటదు' అంటూ కావేరి పకపక నవ్వింది.

'సరి సరి... ఇప్పుడు నేనేం దానికి చెప్పాను. ఎక్కడో వంగనాచిలా వున్నావే...' అని శాంత వెన్నెలగా నవ్వింది.

## 7

కావేరి ఆ గదిలో అడుగు పెట్టినప్పటి నుంచీ శంకరం ఒక విధంగా మారిపోయాడనే చెప్పాలి. రోజూ ఎనిమిదింటికి లేచేవాడిప్పుడు ఏడు గంటలకే లేస్తున్నాడు. ఇలా లేస్తున్న సంగతి శాంతకు ఎక్కడ తెలిసిపోతుందో అని భయపడు తున్నాడు. పాపం దొంగలా మేడ పైభాగం నుంచి కావేరి దర్శన భాగ్యం కోసం అడ్డు వచ్చే నైతిక సంబంధమైన గోడల్ని చూపులతో త్రవ్వుతూ ఎంతో బితుకు బితుకు మం టున్నాడు. ఒక వారం గడిచింది. రెండు వారాలు గడిచాయి కాని అతని కేమీ తోచలేదు. మార్గమేమీ కనిపించ లేదు.

కావేరి మాట, అతని దగ్గర శాంత, ఎత్తడం లేదు. కావేరి విషయమై శాంతను ప్రశ్నించే బలం శంకరానికి కందుబాటులో వుండటం లేదు. శంకరం కావేరిని గురించి ప్రశ్నిస్తే అప్పుడామె సంగతులనేమైనా చెప్పొచ్చని శాంత తలపోస్తూంది. అయినా ఒకటి రెండు సార్లు ఏమో చెప్పబోయింది. కాని శంకరం, కావేరి ఉనికిని హర్షిస్తున్నాడో, అసహ్యించుకుంటున్నాడో ఆమె కవగాహన కాక అతను అడిగినప్పుడే చెప్పొచ్చులే అని తిరిగి నిర్ణయించుకొని ఆ సంగతే ఎత్తకుండా వూరుకుంది.

శాంత కావేరి విషయమై ఈ విధంగా ఏమీ మాట్లాడకుండా వుండటాన్ని శంకరం పసిగట్టాడు. శాంత తనను అనుమానించిందని గట్టిగా నిర్ణయించుకున్నాడు, ఇక ఈ విషయంలో మరింత జాగ్రత్తగా వుండాలని మనసులోనే నిశ్చయించుకొని, దాన్ని చక్కగా అమలు జరపడంలో ఏ లోపమూ రాకుండా చూసుకుంటున్నాడు.

పాపం శంకరం ఆఫీసులో అసలు క్షణం వుండలేక పోతున్నాడు. ఇంటి దగ్గర అతని కిష్టప్రకారంగా వుండటానికీ వీలు లేకుండా పోతోంది. ఇక్కడ వున్న సమయంలో శాంత అతని కెదురుగా కూర్చుంటోంది. పాపం శాంత తన ముందు కూర్చొని వుండకపోతే తను అలిగిన రోజులతో జతచేసి, ఇప్పటి పరిస్థితిని అతను సరిపోల్చి చూసుకోలేక పోతున్నాడు. శాంతను పొమ్మనలేని దుస్థితిలో కొట్టుకుంటున్నాడు. ఆమె

ముందు తియ్యగా మాట్లాడలేని సమయం ఏక్షణాన్నయినా ముసురుకుంటుందేమోనని దడదడ కొట్టుకునే గుండెలతో తనను తను అదుపులో పెట్టుకోలేని బలీయమైన వాంఛల గుర్రాలను, జీర్ణించిపోతున్న ధర్మం తాలూకు పగ్గాలు వేసి ప్రాణాలతో లాగి పట్టుకుంటున్నాడు. బ్రతుకు దుర్భరంగా వున్న సంగతి గుర్తించగలుగుతున్నాడు. శాంతను మనసులో ద్వేషిస్తున్నాడు.

ఒక నెల గడిచింది. మరొక నెల వెళ్ళిపోవడానికి సిద్ధంగా వుంది.

శంకరానికి కాపూరు విడిచిపెట్టి పారిపోవా లనిపించింది. ఆ యిల్లు ఖాళీచేసి ఎక్కడికయినా వుడాయించాలనిపించింది. ఆఫీసులోని బంట్రోతులనుపట్టుకొని పిచ్చిగా తెగబాదా లనిపించింది. శతకోటికంఠాలతో దాహం దాహం అంటూన్న ప్రత్యణువునూ కల్లబొల్లి మాటలతో అణచి వుంచడం దుర్భర మనిపించింది. కావేరి నిద్రపోతున్న ఆ గదికి అటూ ఇటూ గొళ్ళెం పెట్టి నిప్పంటించేస్తేసరి; ఈ బాధ ఉపశమించవచ్చు అనుకున్నాడు. కాని అంతలోనే, కాదు... కాదు... శాంత కుత్తుక పిసికివేస్తే సరిపోతుంది... అవును... అవును... అను కున్నాడు. ఈ వూహాలతో అతని గుండె శూన్యంలో వేద నగా కొట్టుకుంది. మొగంలో బాధ ముక్కలైపోయిన ప్రణయ సంబంధపు చరిత్ర బాపతు గోడలా ఎలుగెత్తి

ఏడ్చింది. అతని దుఃఖం సజీవంగా సమాధి చేయబడ్డ మనిషి లోని ప్రాణంలా విలవిల తన్నుకుంది.

హైందవ సాంప్రదాయాలమీద, కట్టుబాట్ల మీద ఒక్క సారిగా శంకరం విరుచుక పడాలనుకున్నాడు. పాశ్చాత్య నాగరికత అతని కళ్ళ ముందు మెరిసింది. అసలు నీతి అంటే ఏమిటి అనిపించింది. నియమానికి మారు పేరే కదా... ఈ నీతి... అంతకన్నా ఏముంది? ఇలాగే వుండాలని ఎక్కడ రాసి వుంది. ఈ నియమాలు మారగూడదని, ఈ నీతులు ధర్మాలలో మార్పులు రాకూడదని ఎక్కడ లిఖించబడి వుంది. అనుకున్నాడు.

ఆ రోజున శంకరం గట్టిగా నిర్ణయించు కున్నాడు. ఈ రోజున ఏమైనా సరే అటో ఇటో తేలిపోవాలనుకున్నాడు. తనదగ్గర కావలసినంత డబ్బువుంది. డబ్బేకాదు... తన దగ్గర ఎనలేని సౌందర్యంకూడా వుంది. స్త్రీకి డబ్బు, సౌందర్యం మినహాయించి ఈలోకంలో ఇక కావలసిందేముంది అనుకు న్నాడు. అయినా, ఆమెను పొందడానికి ఇన్ని సాధనా లక్కర లేదు అనుకున్నాడు.

ఆమెకూ తనకూ నష్టంలేని పద్ధతి— ఒకే ఒక్కముక్క— ఆమెఆమోదిస్తుందా...ఆమోదిస్తుంది, లేకపోతే లేదు. ఆమెకు తెను నచ్చక పోవడమనేది సామాన్యంగా వుండదు. ఒకవేళ తెను నిజంగా ఆమెను ఇష్టం కాకపోయినా తనకు పోయిం దేమీ లేదు. తను ఆమెను ఏరూపంలోనూ హింసించడు. ఆ

మీదట ఆమె మూశే తలపెట్టడు. ఏమీ తెలియనట్లే ఆమె అంటే ఎవరో ఎరుగనట్లే నడుచుకుంటాడు. కాని కనికరించమని వేడుకుంటాడు, జాలి కలుగుతుందా సరేసరి. లేకపోతే ఇక ఆ పరిస్థితిలో ఏమిజరుగుతుందో మరి; తనకు మాత్రం ఏం తెలుస్తుంది. అనుకున్నాడు.

తిరిగి మెల్లగా తనలో, తనకు ఆమె మీద ఎంతో మనసు వున్నట్లు వీలైనప్పుడల్లా చెప్పాలనుకున్నాడు. ఇందులో ఆమెను ఇరకాటాన పెట్టడమనే తలంపు కించిత్తూ వుండగూడదనుకున్నాడు. తనను ఆమె ఏవిధంగా అంగీకరించినా సరే... తనకు సమ్మతమే... ఇందులో ప్రేమ లేకపోవచ్చు. అసలు వుందో లేదో దేవుని కెరుక. ఇది ప్రేమ అవునో కాదో తనకు తెలియని రహస్యం. దీని కెటువంటి పేరుపెట్టినా తన కభ్యంతరం లేదు. కాని ఈ విషయం ఏరూపంలోనూ శాంతకు మాత్రం తెలియగూడదు. అంతే... అనుకున్నాడు.

అతని నిశ్చయాని కొకరూపం వచ్చింది. ఆ రూపం ముందు కావేరి జాలిగా నిలిచింది. అతను దయతలిచాడు. కావేరి కేవలం వో నిరుపేద పంతులమ్మ. ఆమె ఇక్కట్టులు తనకేమీ తెలియవు. ఇకముందు తను తెలుసుకోడానికి ప్రయత్నిస్తాడు. ఆమెను వుద్ధరించడానికి నడుం కడతాడు. ఆమెను అన్నివిధాలా పైకి తీసుకరావడానికి ఎన్ని ఆటంకాలున్నా ఎదుర్కొంటాడు. కాని, ఆమె తనదైపోవాలి. అప్పుడే తను ఆమెకేదైనా చేయుకలడు. ఛీ! ఈ ఆలోచన బాగులేదు. తన

దగ్గర డబ్బులేదు. తన దగ్గర రూపంలేదు. తనదగ్గర ఏమీ లేదు. కాని...కాని... తనదగ్గర ఒకే ఒక్క వస్తువు వుంది. అది అమూల్యమైనది. ఆ ప్రేమ మాధుర్యంలో తను కావేరిని ఉర్రూతలూపగలడు. ఆమెకు తను ఈ విషయాన్ని నచ్చ చెప్పగలిగితే చాలు, ఆ మాత్రం చాకచక్యం తనమాటల్లో ప్రవేశిస్తే చాలు. ఆమెను తనదానిగా చేసుకోగలడు. ఆమె తనది. తనదే ఆమె! అందుకనే యీ ప్రదేశానికి ఎక్కడ నుంచో రెక్కలు కట్టుకొనివచ్చి వ్రాలింది. ఇది ఎన్నిజన్మల తపః ఫలమో... అవును. ఇక జాగు చేయకకూడదు. ఈ రోజునే ఆమెను కలుసుకోవాలి! ఒకరి నొకరము తెలుసు కోవాలి! అనుకున్నాడు.

చీకటి పడింది.

చీకటి పడినకొద్దీ శంకరం గుండెల్లో చీకటి అలుముకుంది. ఆచీకటిలో అతనిగుండెలోతుల్లో ఆకసంలోని ఒక్కొక్క చుక్క ఒక్కొక్క అప్సరసై మదోన్మత్తతతో నృత్యం చేశాయి.

శంకరం లొంగిపోయాడు. చప్పున తన మంచంమీదించి లేచాడు. అమాయకంగా నిద్రపోతూన్న శాంత మొగం లోనికి చూడలేకపోయాడు. వెనువెంటనే మేడ దిగిపోయాడు. క్రిందకు ఆ అధోలోకానికి విచ్చేశాడు. ఒకొక్కడుగే ముం దుకు సాగనిచ్చాడు. సాగిన ఒకొక్క డుగు అడుగునా బడి ఛిద్రమైపోతూన్నధర్మం లక్షకంఠాలతో 'వద్దు...వద్దు...వద్దు.

శంకరం...' అని ఎలుగెత్తి విహ్వాలంగా విలపించింది. శంకరం లెక్క చేయలేదు, శంకరం చెక్కుచెదరలేదు. కానీ వేరివున్న గది దగ్గరకు అంతత్వరగా ఎట్లావచ్చిందీ అతని కవగతముకాలేదు. వచ్చిన శంకరం ఆ తలుపుమీద చేయివేశాడు. ప్రాణం జివ్వుమంది. ఇంతలోనే లోపలినుంచి ఫక్కున నవ్వు వినిపించింది. అబ్బ! ఒకేఒక్క నవ్వుకాదది, ఇద్దరికంఠాల కలయిక అది! గుండెలు కెలికే నవ్వది! ఆ తరువాత ఏదో పుస్తకం చదువుతూన్న ధ్వని... కాని శంకరం ఇంకేమీ వినిపించుకోలేదు.

ఇంకేముంది... అతనికి దురన్యాయం జరిగిపోయింది. అతన్నెవరో తలక్రిందుగా వ్రేలాడగట్టి చర్మం ఒలిచినట్లయింది. అతనిలోని అణువులన్నీ భగభగ మండిపోయాయి. అవి ప్రళయంగా కుత్తుక చించుకోబోయాయి. 'ఎంత దుర్మార్గం... ఎంత దుర్మార్గం' అని అతనిపళ్లు రాపాడాయి. అడ్డుగా వున్న ఆ తలుపుల్ని బద్దలు చేసెయ్యాలని అతని కాలు లేవబోయింది. ఆ లోపల వున్న జీవాలను హతమార్చెయ్యాలని అతని చేతులు ఆకసంలోనికి చొచ్చుకొని బిగుసుకుపోయాయి. ఒక్కక్షణంలో అతను శాంతదగ్గరకు వచ్చి చేరాడు. నిద్రపోతూన్న శాంతను, బలంగా గుంజి, 'శాంతా' అని అరచాడు. 'ఎన్నాళ్ళనుంచి శాంతా ఇక్కడ ఇలా సాగుతూంది' అంటూ పెద్ద పెట్టున గర్జించాడు.

శాంత మేలుకొంది. మెల్లిగా తాపీగా 'ఏమిటండీ ఏమిటీ. . అరే అదేమిటీ మీరలా వణికిపోతున్నా రేమిటి' అంది.

తిరిగి శంకరం అదే మాట రెట్టించాడు. 'ఇక్కడ ఎన్నాళ్ళ నుంచి ఇలా సాగుతోంది' అని మొగాన్ని వికృతం చేసుకున్నాడు. శాంత తిరిగి అమాయకంగా 'ఏమిటండి... ఏమి జరిగింది... అసలు సంగతి చెప్పరేం...' అంది.

నిప్పులు కురుస్తూన్న కళ్ళతో శంకరం 'ఆ పంతులమ్మ ఆ గదిలో... నీకు తెలియదూ...' అన్నాడు. కర్కశత్వాన్ని కంఠంలోంచి క్రుమ్మరించాడు.

వెంటనే శాంత, అయ్యో వీరికి పాపమా పంతులమ్మ ఈ విషయం చెప్పమన్నా ఇప్పటివరకూ తను ఉపేక్షించి పూరుకోవడం వల్ల ఎంత పని జరిగింది. ఇక ఇప్పుడు మామూలుగా చెప్తే లాభం లేదనుకుంది. తమాషగా శంకరం కళ్ళ లోకి చూడకుండానే పకపక నవ్వి, 'ఇదటండీ... ఇంకా ఏమిటో అనుకున్నాను. బలే సంగతి లే...' అని.... 'వచ్చే నెలలో అన్నవరంలో జరిగే వాళ్ళ పెళ్ళికి మనమే పెద్దలం... పడుకోండి...' అంటూ ఆవులించి సన్నగా నవ్వుతూ తిరిగి నిద్ర నాహ్వానించినట్లు తెలివిగా కన్ను మూసింది.

మరునాడు శాంతదగ్గర మెల్లిగా అన్నిసంగతులూ తెలుసుకున్నాడు. అతను ఒక స్కూళ్ళ ఇనస్పెక్టరనీ, అక్టోబరు నెలలో జరిగే స్కూలు ఫైనలు పరీక్షకు వెళ్తూన్న ఆ

పంతులమ్మకు చదువు చెప్పడానికి—పగలు పదకొండు గంటలు దాటిన తరువాత ఎలాగో వీలు చేసుకొని వస్తూంటాడని, పరీక్షలు ఇక పక్షంరోజులే వుండటంవల్ల రాత్రికూడ రావడం ఆరంభించాడని, ఇక కొన్నాళ్ళల్లో వాళ్లెలాగూ పెళ్లి చేసుకోబోతున్నారు కాబట్టి—ఇందుకు శాంత సమ్మతించిందని, అయినా ఈ మాట శాంత తనకు చెప్తావంటేగాని, కావేరి ఈ విధంగా అతనితో కలిసి ఆయింట్లో వుండటానికి ఒప్పుకో లేదని తెలుసుకున్నాడు. అయినా అతనికి వాళ్లమీద ఏమాత్రం దయ కలుగలేదు. దుర్మార్గులు చేతిలో చిక్కారు అనుకున్నాడు. వీళ్లను నాశనం చేయకపోతే నాపేరు శంకరం కాదు అనుకున్నాడు.

ఆ స్కూళ్ల ఇనస్పెక్టరు, కేంపులో ఉండి కూడ ఈ మధ్య ప్రియురాలు దగ్గరకు వచ్చేస్తున్నాడని, ఎలాగో తెలుసుకో గలిగాడు. దూరపు బంధువైన డి. ఇ. ఓ. ను ఒక రోజున పట్టుబట్టి భోజనాని కాహ్వానించాడు. ఆ ఇనస్పెక్టరు విశ్వమూ, కావేరి కలసి వస్తూండగా, వాళ్ళను చూడడానికి వీలైన స్థలంలో మేడమీద డి. ఇ. ఓ. ను కూర్చోబెట్టాడు. ఇంకేముంది... అంతా శంకరానికి అనుకూలంగా అతను ఆశించినట్లుగా జరిగిపోయింది. డి. ఇ. ఓ. విశ్వాన్ని చూడటం జరిగింది.

ఆ రోజున కావేరి శాంతవద్ద గొల్లున ఏడ్చింది. శాంత శంకరానికి చెప్పింది. శంకరం ఆ డి. ఇ. ఓ. మంచివాడు

కాదు. నా మాట ఇలాంటి విషయాలలో వినడు. అయినా చెప్పి చూస్తాను...అన్నాడు. శాంత అతన్ని నమ్మింది. నమ్మిన వాళ్ళకు శంకరం ఎప్పుడూ ద్రోహం తలపెట్టలేడు. కాని అతను ఈ విషయంలో తన పట్టుదల వదలించుకో లేక పోయాడు.

ఇంకేముంది? ఎంత బ్రతిమాలి... క్షమించమని ప్రార్థించినా లక్ష్యపెట్టని, కనికరించని శిలా సదృశుడైన ఆ డి.ఇ.ఓ. మొహంమీద రాజీనామా పత్రం విసిరికొట్టి, పాపం విశ్వం మరునాడే కావేరిని తీసుకొని ఆ వూరినుంచి వెళ్ళిపోయాడు.

కావేరి వెళ్ళిపోతూండగా శాంత కన్నీళ్లు పెట్టుకుంది. 'మా దినాలు బాగులేవు...' అన్న ఒక్కమాట మినహాయించి మరేమీ అనలేకపోయింది. వారిమీద ఎలాటి నిందా మోపలేకపోయింది. పాపను చేతుల్లోకి తీసుకొని ముద్దు పెట్టుకొని, శాంతతో 'నన్ను మరచిపోకండి' అంటూ వెక్కి-వెక్కి ఏడ్చింది. శాంత ఆ బాధ భరించలేకపోయింది. అట్లా ఏడుస్తూన్న కావేరి వంక ఆమె చూడలేకపోయింది, ఏ అందాల రాణికి తను తన చేతులతో పెళ్ళిచేయాలని ఉవ్విళ్ళూరిందో... ఆమెకు, ఆ సౌందర్యరాసికి, ఆ సుగుణాల తల్లికి... తను, తన చేతులతోనే అపకారం చేసినట్లు బాధ పడిపోయింది. ఎంతో కుమిలిపోయింది. హృదయంతో దుఃఖించింది. ఏమీ చెయ్యలేని అశక్తతతో గుండె లోతుల్లోంచి, 'ఎంతపని జరిగింది కావేరీ...' అంది. కావేరి కన్నీళ్ళతో సెలవుతీసుకుంది.

వెళ్ళిపోతూన్న కావేరి చేతులు పుచ్చుకొని శాంత, 'నీకు ఏమీ చేయలేకపోయిన ఈ అక్కను మన్నించు చెల్లీ...' అంది. కావేరి చెమ్మగిలిన కళ్ళతో శాంతకు చేతులెత్తి నమస్కరించింది. శాంత ప్రాణం లేనిదానిలా వెళ్ళిపోతూన్న ఆ కావేరివైపు అలాగే చూస్తూ కొయ్యబారి పోయింది.

ఆ రాత్రి శంకరం నోటి మీదుగా, కావేరి గురించి వ్యంగ్యంతో కూడిన మాటలు వినడంతో ఆ రోజున జరిగిన విషాద సంఘటన కంతా కారకుడు శంకరమే అని శాంత గ్రహించింది. ఆమె మనసు కుతకుత ఉడికిపోయింది. కావేరి కోసం తహతహ లాడిపోయింది. ఆనాడు శంకరాన్ని ఆమె ఎంతగా అసహ్యించుకుందో... కావేరి కోసం పాపము అంతగా దుఃఖించింది. ఆపుకోలేని దుఃఖంతో మీరు రాక్షసులు... మీరు రాక్షసులు... అంది. 'ఆ అమాయకులు మీకు ఏమి హాని చేశారు...ఎందుకు మీ రిలాంటి దారుణానికి పూను కున్నారు...' అంది. పగపట్టిన వాళ్లు కూడా ఇలాంటి పని చేయలేరే...,ఇంత నిర్దాక్షిణ్యంగా నడుచుకోరే ... మీకు వాళ్ళమీద దేనికింత కక్ష ఏర్పడింది. అయ్యో... వాళ్ళు పెళ్ళి చేసుకో బోతున్నారని చెప్పానే...' అంది. మాటా మంతీ లేకుండా, తల వాల్చుకొని ఎదురుగా కూర్చున్న శంకరాన్ని శాంత ఏ మాత్రం సహించ లేకపోయింది. మీరు కిరాతకులు... నిజంగా మీరు కిరాతకులు...'అంది.

ఆమె పడుతూన్న వ్యథ ప్రవాహంగా ప్రవహించింది. దుఃఖం మాటల కడ్డు వస్తుండగా ఆమె, 'వాళ్ళ వుసురు మీకు తప్ప కుండా తగుల్తుంది... ఈ పాపానికి మీకు శిక్ష పడుతుంది'' అంది.

# 8

తిరుపతి కొండమీద శాంత కెదురుగా కూర్చున్న శంకరం తల గిర్రున తిరిగింది. 'శాంతా... శాంతా... నేను దుర్మార్గుడ్ని... నా పాపాని కిదేశిక్ష... అవును... అవును కాని లే శాంతా... 'పాపను వెదికి తెచ్చి నీ ముందు వుంచే బాధ్యత నాది శాంతా...' అన్నాడు.

కాని శాంత పాపలేకుండా శంకరంతో ఇంటికి బయలు దేరలేక పోయింది. ఆమెకు ఆ కొండల మీంచి దూకి ప్రాణ త్యాగం చేయాలనిపించింది.

శంకరం శాంతను ఎట్లా శాంతింప జేయాలో ఆమె దుఃఖాన్ని ఎట్లా నివారించాలో వూహించ లేక పోయాడు. పాపం...పాప కోసం అతని మనసు వేయిదిక్కులు వెదుకు తూంది. శాంతను సుఖంగా ఇంటికి తీసుకెళ్ళే మార్గంకోసం ఎంతో తపించి పోతోంది. కాని, ఏమి లాభం...

సమస్త ప్రకృతీ శాంత పడుతూన్న దుఃఖాన్ని నివారించలేకపోయింది. ఆకసాన ముసురుకున్న మబ్బులు,అయ్యో

...మాలో జలధారలేగాని, శాంత అనుభవిస్తూన్న ఈ దుఃఖభారాన్ని నివారించ గలిగే ఆనంద వాహినులుంటే ఎంత బాగుండును అని విలపించాయి. చల్లగా వీస్తూన్న గాలి మెలికలు తిరిగిపోతూ, 'నాలో చల్లదనమే'గాని, ఈ దుఃఖిత వదనను, ఈ చిన్నారి తల్లిని ఓదార్చే శక్తి వుంటే ఎంత సుఖంగా వుండును, అని కుమిలి కుమిలి ఏడ్చింది. చుట్టూ వున్న ఆ ప్రకృతి సౌందర్య మంతా 'అయ్యో నాలో శాంత వచనాలు ప్రవచించే శక్తి ప్రసత్తులు వుంటే శాంత మనసు కెంతటి శాంతి నీ సమయంలో ప్రసాదించగలిగే దాన్ని అని ఎంతో ఎంతో చింతించింది.

పాపం శంకరం ఒకరోజు రోజంతా శాంతను బ్రతి మాలాడు. పాపకోసం ఆ చుట్టుప్రక్కల పూర్తిగా గాలిం చాడు, కాని పాప ఎక్కడా కనిపించలేదు. అతి కష్టంమీద ఇక్కడి కన్నా ఇంటిదగ్గర వుంటేనే పాపను వెదికే మార్గాలు హెచ్చుగా వుంటాయని ఎంతో నచ్చజెప్పి శాంతను మెల్లిగా ఒప్పించి ఆమెను ఇంటికి అతికష్టంమీద బయలుదేర తీశాడు. రైలు వేగంగా తీసుకొచ్చి వాళ్ళను ఇంటికి చేర్చింది. పాపకోసం దుఃఖిస్తూ ఆ మూడు రోజులూ శాంత పచ్చి మంచినీళ్ళయినా ముట్టుకోలేదు.

ఇంటికి రాగానే తలుపు తియ్యగానే ఇన్ని వుత్తరాలు ఆ యింట్లో పడి ఉన్నాయి. పాపకోసం శంకరం పేపర్లలో ప్రకటన చేశాడు, పాప ఆచూచి తెలిసిన వారెవరైనా ఏమ

యినా బాబు వ్రాశారేమో అని శంకరం గబగబా ఆ వుత్త రాలు చింపాడు. ఒక వుత్తరం శాంత పేరిట వస్తే దాన్ని ఆమెకు అందించాడు. వచ్చిన వుత్త రాలన్నీ గబగబా చదివాడు. కాని ఒక్క-దానిలోనూ పాప సంగతి లేదు. అతని మొగం నల్లగా మాడిపోయింది. అతని గుండెల్లో ఎవరో, 'నీకిదే శిక్ష... ఇదే శిక్ష...' అని అరిచారు. ఒక్క-సారిగా శంకరం గుండెలు వ్రక్క-లయ్యేట్టుగా 'పాపా...' అని ఆ టేబులు ముందు అలాగే కూర్చొని, దానిమీద తలనుపెట్టి, ఆ తలను చేతులతో పట్టుకున్నాడు. 'పాపా... నాకు కనిపించవూ... కనిపించవూ... మీ అమ్మ నీకోసం ఏడుస్తోంది పాపా అని పొంగి పొరలిపోతూన్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. ఎర్రబారిన కళ్ళతో చెంపలు మీంచి జారుతూన్న కన్నీళ్ళతో తలను మెల్లిగా పైకి ఎత్తి శాంత మొగంలోకి చూశాడు. అప్పుడే శాంత, తను చదువుతూన్న ఆ వుత్తరాన్ని తన గుండెలకు హత్తుకొని 'కావేరీ అనుకుంది. ఆమె కళ్ళల్లో పాప పాటలు పాడుతోంది. ఆమె ఆనందం మోహనంగా వెలుగుతూంది.

వెంటనే శంకరం, 'ఏమిటి శాంతా... పాప వుందా... ఎక్క-డ శాంతా... ఆ వుత్తరం ఎవరు వ్రాశారు... ఇలాయియ్యి... నన్ను చదవనీ... ఎక్క-డ దొరికింది పాప' అంటూ ఒకటే వేగంగా మాట్లాడేస్తూ, గబగబా ఆ వుత్తరాన్ని శాంత దగ్గరనుంచి తీసుకున్నాడు.

ఆ వుత్తరం కావేరి వ్రాసింది. శంకరం ఆ వుత్తరం చదువుతున్నాడు.

శాంత చూపులతో నవ్వుతూ... 'మా కావేరి ఎంత మంచిది...ఎంత మంచిది' అంది. వెంటనే ఇంకా చూస్తారే మండి... గుంటూరుకు ఇప్పుడు బండి వుందిగా... వెళ్ళి మీ పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవడం మంచిది... అని నవ్వింది. మీరు చేసిన పనికి అతను కూడ రైల్లో కనిపించిన దిక్కులేని మన పాపను చూడనట్లు వూరుకుంటే ఏమయ్యేది అంది. కాని అంతా మీ లాంటి వాళ్ళే ఎక్కడ వుంటారు లెండి... మీలాంటి బుద్ధే అందరికీ వుంటే ఈ ప్రపంచంలో మంచితనం ఇంకా ఎక్కడ మిగిలి వుంటుంది. అబ్బ! కావేరి ఎంత తెలివైనది... నేనప్పుడే అనుకున్నాను. మంచి భర్తనెన్నుకోవడంలో ఏమాత్రం పొరబాటు చెయ్యదని' అని కాస్త ఆగి, తిరిగి వెంటనే 'ఇంకా కదలరేమండి... ఏం... పాపను తీసుకురావాలని లేదా...' అంటూ తొందర చేసింది.

శంకరం కళ్ళల్లో నీళ్లు నిలిచాయి. శాంత ముందు అతను నిలబడలేకపోయాడు. పశ్చాత్తాపంతో కృంగిపోతూ అతి కష్టంమీద పాప దగ్గరకు బయలుదేరాడు.

బయలుదేరినవాడు తిరిగి ఇంటికి వెళ్ళిపోవా లనుకున్నాడు. వాళ్ళ మొగం చూడగలగడం దుర్భరం అనుకున్నాడు.

టికెట్టు తీసుకొని రైలు దగ్గరకు కదలలేకపోయాడు. రైలు ఎక్కినవాడు ఆ బండి మీంచి క్రిందికి దూకాలనుకు న్నాడు. ప్రక్క స్టేషనులో దిగిపోయి, వాళ్ళకు పాపను ఇంటికి తీసుకొచ్చి అప్పజెప్పమని ఉత్తరం వ్రాసి అందుకు సరిపడే డబ్బు మనియార్డరు చేయాలనుకున్నాడు. అయినా దుర్మార్గులు... వాళ్ళు పాపను ఇంటికి తీసుకొచ్చి అప్పజెప్ప టానికి బదులు ఇట్లా ఉత్తరం వ్రాయడం సహించవలసిన విషయం కాదనుకున్నాడు. ఒకవేళ తన దగ్గర డబ్బు ఆశిస్తు న్నారేమో అనుకున్నా. కాదు... కాదు. తనను దారుణ మైన మాటలతో హింసించి విడిచిపెట్టాలని చూస్తున్నారు అనుకున్నాడు. కాని అంతలోనే, "ఛీఛీ... నా మనసు మంచిది కాదు... నా మనసు మంచిది కాదు... వాళ్లు మంచివాళ్లు... నేను చెడ్డవాణ్ణి" అనుకున్నాడు.

రైలు వూళ్లు దాటిపోతోంది. కాని అతను వెనక్కి మరలి వెళ్ళలేక పోయాడు. బెజవాడ సమీపించేప్పటికి అతని గుండెల్లో బాధ హెచ్చిపోవడం మొదలు పెట్టింది. అయినా అతను సహించాడు. అనుభవించాలి... తప్పదు... అను కున్నాడు.

బెజవాడలో బండి మారి గుంటూరులో కాలుపెట్టాడు. అప్పుడే అతని మనసు 'పారిపో శంకరం... పారిపో' నువ్వీ బాధ భరించలేవు... ఏమాత్రం సహించలేవు...' అంది. కాని శంకరం పారిపోలేక పోయాడు.

రిక్షా వచ్చి ఓ సందులో ఆగింది. శంకరం వారి ఇల్లు ఎక్కడో వాకబు చేశాడు. ఆ ఇంటి ముందు వచ్చి నిల బడ్డాడు. ఆ ఇంటి తలుపు మీద చేయి వేశాడు. అప్పుడే ఆ లోపలినుంచి పకపక నవ్వు వినిపించింది. 'మీ నాన్నగారు రారు పాపా...' అంది ఓసన్నని కంఠం. పాప, మరి 'మా అమ్మో' అంది. ఆ కంఠం తిరిగి, 'మీ అమ్మ కూడా రాదు...' అని కిలకిల నవ్వింది.

శంకరం కాళ్ళల్లో బలం వచ్చిపోయింది. 'ఇంకా ఇక్కడే నిలబడతావేం శంకరం...పారిపో... పారిపో... వాళ్ళు చేసే అవమానాన్ని నువ్వు భరించలేవు...' అని అతని లో లోపలి మనసు, తొందర చేసింది. కాని అప్పుడే అతని కళ్ళ ముందుకు శాంత వచ్చి నిలచింది. 'పాపను మీకు తీసుకరావాలని లేదా ఏం...' అని నిష్ఠురాలాడింది, దండించింది.

మెల్లిగా శంకరం ఆ తలుపు తట్టుతూ 'విశ్వంగారూ' అన్నాడు. ఆ మాట అతని కంఠంలోంచి రాలేకపోయింది.

వెంటనే లోపలి నుంచి 'ఎవరండీ... వారు లేరు' అంటూ కావేరి, తలుపుతీసి పాపను ఎత్తుకొని శంకరాని కెదురుగా నిలబడింది.

అంతే. శంకరం అలాగే నిలబడి పోయాడు. తనకు చెల్లెలే ఉంటే ఇలా ఉంటుందా అన్నట్లు పాపను ఎత్తుకొని నిలబడి వున్న కావేరిని ఆ అతిలోక సుందరిని చూశాడు. పాప,

'నాన్నారూ...నాన్నారూ...' అంటూ అతని ముందుకు చేతులు చాచింది. శంకరం, కావేరి చేతుల్లోంచి పాపను తన చేతుల్లోకి తీసుకున్నాడు. అప్పుడే ఏవేవో అమృత వాహినులు అతని శరీరంలోనికి ప్రవహించాయి. వాత్సల్య పూరితమైన అతని అణువణువునా 'కావేరి పాపగా ప్రవహించింది. అప్పుడే శంకరం పెదవులు విడివడ్డాయి. 'మీ ఋణాన్ని తీర్చుకోలేమండి...' అని అతని ఎద. సజల నేత్రాలతో ఏమేమో చెప్పింది. వెంటనే కావేరి గబగబా 'ఇలా కూర్చోండి... వారు కాస్సేపటిలో వస్తారు. ఇప్పుడే మీ సంగతి అనుకుంటున్నామండి...పాపను సరదాగా ఏడిపించాలని, మీరు ఇక్కడకు రారని ఇప్పుడే అంటున్నానండి' అంది.

శంకరం ఆ మాటలకు, ఆ మాటల్లోని నిజాయితీకి ఆ మొగంలోని నిష్కపటమైన తీరు తెన్నులకు అంజలిపట్టాడు. అతని మనస్సు తల్లి ఒడిలో కూర్చున్నట్లు చెప్పలేని సుఖాన్ని అనుభవించింది.

అప్పుడే విశ్వం లోనికి ప్రవేశిస్తూ "నమస్కారమండీ పాపను అసలు నేనే తీసుకవద్దామనుకున్నానండి... కాని..." అని అతను ఇంకా ఏమో చెప్పబోతున్నాడు. కాని, ఎలా చెప్పాలో తికమక పడుతూన్నట్లు కనిపించాడు. అప్పుడే కావేరి అడ్డు వచ్చి, 'అక్కయ్యగారిని కూడా తీసుకరాలేక పోయారండీ...' అని శంకరంతో అంది. విశ్వాన్ని కళ్లతో వారించింది.

అప్పటి వరకూ శంకరం ఆ ఇంటివైపే చూడలేదు. ఆ గదిలో ఎటు చూసినా అతనికేమీ కనిపించలేదు. శంకరం నిలువునా కృంగిపోయాడు. వాళ్ళ సంస్కారానికి, అభిమానానికి తలను వంచాడు. మెల్లిగా 'పక్కింటిగారూ నామాట కాదనవద్దని ప్రార్థిస్తున్నానండీ. ఇప్పుడే మీరు బయలుదేరి నాతో మా వూరు రావాలి. శాంత మిమ్మల్ని చూసి ఎంతో ఆనందిస్తుంది.' అన్నాడు.

అప్పుడే కావేరి ఏమో చెప్పబోయింది. కాని శంకరం 'నామాట కాదనకు చెల్లీ... మీ అన్నయ్య మాట త్రోసి వేస్తావా...' అన్నాడు. అతనెప్పుడూ భావించని మాటలు అతని కంఠంలో వచ్చినిలచాయి. ఎంత చిత్రం! ఆ మాటలంటూ వుండగా అతని మనసు ఆ ప్రశాంత వాతావరణంలోని ఆ మధుర మంజుల భావాన్ని పూర్తిగా అనుభవించింది. అందులోని ఆ శాంత రసభావ ప్రకటనలోని దివ్య సందేశాన్ని అణువణువునా పులకింప చేసుకుంది!

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
20–2–1957